హైలెవల్ బ్రిడ్జిపై కారు చీకట్లు



హైలెవల్ బ్రిడ్జిపై అలుముకున్న కారు చీకటి

- విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయని వైనం
- రాత్రి సమయాల్లో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు

అయిజ: బ్రిడ్జిని నిర్మించే ముందు ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. బ్రిడ్జిపై విద్యుత్ స్తంభాలు, రేడియం స్టిక్కర్లు, రక్షణ గోడలు ఏర్పాటు చేయాలి. అటు ఆర్అండ్‌బీ అధికారులు, ఇటు మున్సిపల్ అధికారులు ఇవేమి పట్టించుకోకపోవడంతో వాహనదారులు, ప్రజలు నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రమాదాల బారిన పడి ఆస్పత్రులు పాలవుతున్నట్లు వాపోతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో హైలెవల్ బ్రిడ్జిపై కారుచీకట్లతో ప్రమాదాల బారిన పడుతున్నట్లు పేర్కొన్నారు.

నత్తనడకన నిర్మాణ పనులు..

మున్సిపాలిటీలోని పాత బస్టాండ్– కొత్త బస్టాండ్ మధ్యన పెద్దవాగుపై 2023 జనవరిలో రూ.7 కోట్ల నిధులతో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి టెండర్ నిర్వహించారు. 2024 జూన్‌లో బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యింది. నేటి వరకు బ్రిడ్జిపై విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎదురుగా వస్తున్న వాహనాల హెడ్‌లైట్ల వెలుతురు పడి ప్రమాదాలకు గురవుతున్నట్లు తెలిపారు.

పాటించని రోడ్డు భద్రత...

హైలెవల్ బ్రిడ్జికి రోడ్డు నిర్మించడంతో ఇరుపక్కల విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలి. లేదా సెంటర్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయాలి. అదే విధంగా రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరుగకుండా ఉండేందుకు రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఇవేవి లేకుండా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఎస్టిమేషన్‌లో విద్యుత్ స్తంభాలకు సంబంధించిన పనులు లేకపోవడంతో ఆర్అండ్‌బీ అధికారులు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసే కట్టలను నిర్మించలేదు.

రక్షణ గోడల ఊసేలేదు..

అప్రోచ్ రోడ్డుకు ఇరు వైపులా రక్షణ గోడలు నిర్మించాల్సి ఉంటుంది. ప్రణాళికలో రక్షణ గోడలకు సంబంధించిన పనులు చేర్చలేదు. దీంతో కాంట్రాక్టర్ వాటి నిర్మాణం చేపట్ట లేదు. రక్షణ గోడలకు బదులుగా గాడ్స్ స్టోన్‌లు నిర్మించాలని ఉన్నా వాటిని కూడా ఏర్పాటు చేయలేదు. రాత్రి సమయాల్లో బ్రిడ్జిపై కారుచీకటి, దానికి తోడు గాడ్‌స్టోన్స్ నిర్మించక పోవడంతో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ప్రాణనష్టం జరుగకముందే అధికారులు స్పందించాలని ప్రజలు వాహనదారులు కోరుతున్నారు.

రేడియం స్టిక్కర్లు అతికించాలి..



రాత్రి సమయంలో బ్రిడ్జిపై సైడ్ వాల్స్, డివైడర్ కనిపించేలా రేడియం స్టికర్లు ఏర్పాటు చేయాలి. స్టిక్కర్లు లేకపోవడంతో సైడ్‌వాల్స్‌కు, డివైడర్‌కు వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయి. అప్రోచ్ రోడ్డుకు సైడ్‌వాల్స్ ఏర్పాటు చేయకపోవడంతో వాహనాలు గుంతలో పడే ప్రమాదం ఉంది.

–నాగరాజు, అయిజ

లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయాలి..



బ్రిడ్జి నిర్మాణం చేపట్టినపుడు డివైడర్ మధ్యలో సెంటర్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయకపోవడంతో రహదారి మొత్తం చీకటిగా మారింది. కొత్త బస్టాండ్‌లో నిర్మించిన విధంగా సెంటర్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేసి కారు చీకట్ల ఇబ్బందులు తొలగించాలి.

–బాషా, అయిజ

ఉన్నతాధికారులకు తెలియజేస్తాం..



హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ ప్రణాళికలో సెంటర్ లైటింగ్ సిస్టంకు సంబంధించిన పనులు ఆర్అండ్‌బీ అధికారులు రూపొందించ లేదు. దీంతో కాంట్రాక్టర్ విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయలేదు. సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేస్తాం.

–రాజశేఖర్, మున్సిపల్ ఏఈ

క్లుప్తంగా

జాతర సందర్భంగా రైతు సంబరాలు

రాజోళి: మండల కేంద్రంలోని భ్రమరాంబ అడివేశ్వర స్వామి జాతర సందర్భంగా రైతు సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా ఈనెల 5న అంతర్రాష్ట్ర పాలపళ్ల వృషభాల బల ప్రదర్శన, 6న సీనియర్ విభాగంలో వృషభాల బల ప్రదర్శన పోటీలు ఉంటాయన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు వారు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర



అయిజ: మండల కేంద్రంలో తిక్కవీరేశ్వర స్వామి శోభాయాత్ర కార్యక్రమం శనివారం రాత్రి భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఫిబ్రవరి 15న ప్రారంభమైన స్వామి వారి బ్రహ్మోత్సవాలు 15 రోజుల పాటు కొనసాగాయి. ముగింపు కార్యక్రమంలో భాగంగా స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని భక్తులు ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్ల బండిపై ఊరేగించారు. శోభాయాత్రలో మహిళలు మంగళ హారతులు పట్టారు. యువత నందికోలు సేవ నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998–99 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల సిల్వర్ జూబ్లీ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పూర్వ ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు పాల్గొని సంతోషంగా గడిపినట్లు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

లీకేజీలతో నీటి వృథా



ఇటిక్యాల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ తాగునీరు పైప్‌లైన్ లీకేజీలతో వృథాగా పోతున్నాయి. మండల పరిధిలోని కొత్తదేవరపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన దారిలో మిషన్ భగీరథ నీళ్లు రోడ్డుపై వృథాగా పారుతున్నాయి. క్షేత్రస్థాయిలో అధికారులు పట్టించుకోకపోవడం, మరికొన్ని చోట్ల రిపేర్ల కోసమని గుంతలు తవ్వి మధ్యలోనే వదిలిపెట్టడంతో నీరు కలుషితం కావడంతో పాటు వృథా అవుతున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. అధికారులు స్పందించి పైప్‌లైన్ లీక్‌లను సరి చేయాలని కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



అయిజ: తుంగభద్ర నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను మండలంలోని తాండ్రపాడు గ్రామ సమీపంలో ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి డ్రైవర్లు వేణిసోంపురానికి చెందిన వడ్డె దేవేందర్, నాయికి రంగన్న, చిన్న తాండ్రపాడు గ్రామానికి చెందిన బోయ రాముడుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస రావు తెలిపారు.

సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ

గట్టు: మండల పరిధిలోని చమన్‌ఖాన్‌దొడ్డి గ్రామంలో ఆదివారం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సీసీరోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రోడ్డు నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రాజశేఖర్, నాయకులు రామ కృష్ణారెడ్డి, రాజప్ప, చంద్రశేఖర్ గ్రామస్తులు పాల్గొన్నారు.



శాస్త్రోక్తంగా కలశ ప్రతిష్ఠాపన



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు



కలశ ప్రతిష్ఠాపన చేస్తున్న అర్చకుడు

అయిజ: మండల కేంద్రంలోని టీచర్స్ కాలనీ శివాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం కలశ ప్రతిష్ఠాపన కార్యక్రమం వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం హోమం చేశారు. శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఊరేగించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అన్నదానం చేశారు. శివ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. కార్యక్రమంలో నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఆర్డీఎస్ కల్వర్టు

ఉండవెల్లి: మండల కేంద్రం నుంచి జాతీయ రహదారికి వెళ్లే మార్గంలోని ఆర్డీఎస్ కల్వర్టు శిథిలావస్థకు చేరింది. ఆయా గ్రామాల పరిధిలో నిత్యం వందలాది వాహనాలు ప్రయాణిస్తున్న అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని వాహనదారులు విమర్శిస్తున్నారు. కల్వర్టు శిథిలావస్థకు చేరడంతో పాటు అటాచ్ రోడ్డు గుంతలమయంగా మారడంతో ఎప్పుడు కూలుతుందోనని భయం భయంగా ప్రయాణిస్తున్నట్లు తెలిపారు. కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.



ఉండవెల్లి నుంచి జాతీయ రహదారి మధ్యలో శిథిలావస్థకు చేరిన కల్వర్టు

తైక్వాండో ప్రతిభా పోటీలు



అయిజ: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం తైక్వాండో ప్రతిభా పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఇంటర్నేషనల్ మాస్టర్ శ్రీహరి హాజరయ్యారు. 200 మంది విద్యార్థులు పోటీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్హులైన విద్యార్థులకు మాస్టర్లు బెల్ట్‌లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో తైక్వాండో మాస్టర్లు సుధీర్ కుమార్, శ్రీనివాసులు శెట్టి, రవి, నవదీప్ సాగర్, వెంకటేష్, సాయి పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

అయిజ: మండలంలోని చిన్నతాండ్రపాడు గ్రామ శివారులో ఆదివారం రాత్రి పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. పాల్, ఆంజనేయులు, విజయేందర్లను అదుపులోకి తీసుకోగా మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వారి వద్ద రూ.5,470 నగదు, నాలుగు బైక్‌లు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో పరమేశ్వరస్వామి జాతర

- స్వామివారికి దానంగాలతో మొక్కులు
- తేరుకు వేలాదిగా హాజరైన భక్తులు



స్వామివారి మూలవిరాట్ విగ్రహం



ఆకట్టుకున్న పల్లెకోలాటం

ఆత్మకూర్: పట్టణం శివారులోని చెరువు మధ్యలో వెలిసిన స్వయంభూ పరమేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి భక్తిశ్రద్ధలతో పూజలు, రథోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించి ఉత్సవమూర్తి విగ్రహాలను ఆలయంలోని శివలింగంపై అలంకరించారు. వందలాది మంది భక్తులు బక్షాలు, పచ్చిపులుసు, అన్నంతో స్వామివారికి నైవేద్యం సమర్పించి దానసంగాలు పెట్టారు. అనంతరం ప్రముఖ పూజారి కర్నసయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. జాతర కమిటీ కన్వీనర్ వెంకటనర్సింహారావు, నిర్వాహకులు సాయిరాఘవ, మణివర్ధన్‌రెడ్డి, యాదగిరిశెట్టి, తెలుగునాగేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లను ఘనంగా చేపట్టారు. గుంటిపల్లి గ్రామస్తుల పల్లెకోళ్ల కోలాటం ప్రత్యేకార్షణగా నిలిచింది.

కనులపండువగా పల్లకీ సేవ..

ఆదివారం రాత్రి వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి మొదలుకొని పట్టణంలోని పుర వీధుల గుండా స్వామివారికి మేళతాళాలతో పల్లకీసేవ నిర్వహించారు. అనంతరం పల్లకీసేవను ఆలయానికి చేర్చి ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. సోమవారం రాత్రి తేరు సందర్భంగా ప్రత్యేక పూజలు, ఇతర కార్యక్రమాలు చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రహ్మతుల్లా, రవికాంత్, నాగేష్, పరమేష్, తులసిరాజ్, శ్రీను, దామోదర్, మహేష్ తదితరులు ఉన్నారు.



స్వామివారి రథోత్సవం

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు

పరమేశ్వరస్వామి జాతరను పురస్కరించుకొని ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. మొత్తం 40 జట్లు పాల్గొనగా సోమవారం ఫైనల్ మ్యాచ్ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతి రూ.20 వేలు, రెండో బహుమతి రూ.15 వేలు, మూడో బహుమతి రూ.10 వేలు, నాల్గో బహుమతి రూ.5 వేలు నగదుతో పాటు షీల్డ్‌లను ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి చేతుల మీదుగా అందజేస్తామని వివరించారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న మాజీ ఎంపీపీ, ఉపాధ్యాయులు

గట్టు: పదో తరగతి వార్షిక పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత ఈ ఏడాది కూడా సాధించాలని మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంతో పాటు వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన ఉపాధ్యాయులను, విద్యార్థులను సన్మానించి మెమొంటో అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ గోపిలత, రాయాపురం మాజీ ఎంపీటీసీ రంగస్వామి, పీఏసీఎస్ డైరెక్టర్ తిమ్మప్ప, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు



ధరూరు ఎంబీ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

ధరూరు: మండలంలోని ఆయా గ్రామాల్లో చర్చిల్లో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. మార్చి నెల మొదటి ఆదివారం కావడంతో బల్లారాధన కార్యక్రమాలు చేపట్టారు. మండల కేంద్రంలోని ఎంబీ షాలేం మందిరంతో పాటు హోసన్నా, మరనాథ విశ్వాస సమాజ మందిరం, కల్వరి చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలని పాస్టర్లు సూచించారు. ఈ సందర్భంగా సహపంక్తి భోజనాలు చేశారు.పాస్టర్లు రవి, కృపరాజ్, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

‘పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి’



మాట్లాడుతున్న వెంకటేష్

అమరచింత: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు ఎండిపోయిన పంటలకు పరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కోశాధికారి వెంకటేష్ డిమాండ్ చేశారు. మండలంలోని పాంరెడ్డిపల్లిలో ఆదివారం రైతు సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దేశంలో రైతులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, ఎరువులపైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీలు ఎత్తేసి అన్నదాతలపై భారం మోపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పండించే ప్రతి పంటకు గిట్టుబాటు ధరను కల్పించి మార్కెట్‌లో స్వేచ్ఛగా అమ్ముకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. క్షేత్ర స్థాయిలో సరైన మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో రైతులు దళారుల చేతిలో నేటికీ మోసపోతున్నారని వాపోయారు. కార్యక్రమంలో మోహన్, రాజు, శంకర్, నాగరాజు, చంద్రాయుడు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘం నాయకుల ముందస్తు అరెస్టు



పోలీసుస్టేషన్‌లో విద్యార్థి సంఘాల నాయకులు

అమరచింత: జిల్లా పర్యటనకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం రావడంతో ముందస్తు చర్యల్లో భాగంగా విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మండలంలోని ఏబీవీపీ, పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, విద్యార్థి సంఘాల నాయకులతో పాటు వామపక్ష పార్టీలకు చెందిన యువజన సంఘాల నాయకులను సైతం అరెస్టు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. ఈమేరకు విద్యార్థి సంఘాల నాయకులతో పాటు యువజన సంఘాల నాయకులు రాకేష్, ఉదయ్, రాఘవ, వెంకటేష్, రాజు, కుతుబ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రశ్నించడం నేరమైందని, రాష్ట్రంలో రాచరిక పాలన కొనసాగుతుందని మండిపడ్డారు.

‘దివ్యాంగులను నామినేట్ చేసే చట్టం తేవాలి’



మాట్లాడుతున్న అడివయ్య

వనపర్తి రూరల్: రాష్ట్రంలో మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్‌లో ఇద్దరు దివ్యాంగులను నామినేట్ చేయడానికి వీలుగా ప్రత్యేక చట్టం చేయాలని ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం అడివయ్య డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎన్‌హెచ్‌సీ కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు ప్రభుస్వామి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడ్జెట్‌లో పెన్షన్ పెంపు కోసం నిధులు కేటాయించాలన్నారు. రాష్ట్రంలో నేషనల్ డిసబుల్డ్ స్టడీస్ రిపోర్ట్ ప్రకారం 43.02 లక్షల మంది (రాష్ట్ర జనాభాలో 12.02 శాతం)దివ్యాంగులు ఉన్నారన్నారు. ఇప్పటికే రాజస్థాన్, చత్తీస్‌గడ్ ప్రభుత్వాలు స్థానిక సంస్థల్లో ఇద్దరు దివ్యాంగులకు నామినేట్ చేయడానికి ప్రత్యేక చట్టాలు చేసి అమలు చేస్తున్నారని తెలిపారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ హామీ ఇచ్చిన ప్రకారం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున ప్రత్యేక చట్ట సవరణలు చేసి స్థానిక సంస్థలలో ఇద్దరు దివ్యాంగులను నామినేట్ చేసే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్యాంసుందర్ రెడ్డి, నరసింహులు, చెన్నయ్య, లక్ష్మి, భాగ్యలక్ష్మి, బంగారయ్య, మంగమ్మ, కృష్ణవేణి, రాధిక, స్వామి, రాములు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి అంకురార్పణ



భూమిపూజ చేస్తున్న వేద పండితులు, ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలో అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహిస్తున్న ప్రదేశంలో బ్రహ్మశ్రీ గోపాలకృష్ణ గురుస్వామి ఆధ్వర్యంలో ఆగమశాస్త్ర పండితులు శ్రీనందివెలుగు బ్రహ్మశ్రీ బాలాజీ గురుకుల్ వారి బృందం ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్ప ఆలయ నిర్మాణం కోసం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో భాగంగా స్థల సంప్రోక్షణ లక్ష్మీగణపతి హోమం, వాస్తు హోమం, నవధాన్యాలు, నవరత్నాలు, పంచలోహాలతో యంత్రస్థాపన తదితర కార్యక్రమాలు నిర్వహించి ఆలయ నిర్మాణం త్వరితగతిన పూర్తి కావాలని పూజలు చేశారు. ఆలయ నిర్మాణ ప్రారంభోత్సవం కార్యక్రమానికి దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు డాక్టర్ పీజే బాబు, మాజీ ఎంపీపీ గుంత మౌనిక, పి.విశ్వేశ్వర్, అయ్యప్ప ఆలయ నిర్మాణ నిర్వాహకులు లింగేశ్వర్, విశ్వనాథం గంగాధర్, గుంత ప్రకాష్, గుంత మల్లేష్, బీమ కిషోర్‌కుమార్, గుంత కళ్యాణ్, సత్యం సాగర్, లక్ష్మీనారాయణ యాదవ్, రాజశేఖర్, నరేందర్‌రెడ్డి, కవీందర్‌రెడ్డి, భీమ రాజు, ధన్వాడ వెంకటేష్, శివకుమార్‌రెడ్డి, ఆకుల శ్రీనివాసులు, రవీందర్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, నితిన్ చారి, రాఘవేంద్ర, నరేష్, శ్రీనివాసులు, భాస్కర్, రవి గౌడ్, పెంటన్న, విశ్వమోహన్‌చారి, బీమ చంద్రకాంత్, భీమ రవి, సతీష్‌కుమార్, నవీన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలి



ధర్నాకు బయలుదేరుతున్న సీపీఎస్ ఉద్యోగులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బాలస్వామి, కార్యదర్శి చంద్రకాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక జెడ్పీ కార్యాలయం నుంచి చలో ఇందిరాపార్క్ ధర్నాకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి 24న కేంద్ర ఆర్థికశాఖ విడుదల చేసిన గెజిట్ ప్రకారం యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ 1 ఏప్రిల్ 2025 నుంచి అమలు చేయాలని గెజిట్‌లో పేర్కొన్నట్లు తెలిపారు. ప్రభుత్వాలు సీపీఎస్ యూపీఎస్ వంటి పెన్షన్ పథకాలతో ఉద్యోగ ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. గత పదిహేనేళ్లుగా సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ ఇవ్వాలని పోరాటం చేసి గ్రాడ్యుటీ, ఫ్యామిలీ పెన్షన్ సాధించుకున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ సెల్ కన్వీనర్ వెంకటేష్, జిల్లా కోశాధికారి రాఘవేంద్ర, జిల్లా బాధ్యులు రాఘవేందర్ రెడ్డి, మల్లేష్, రాజేష్, కృష్ణారెడ్డి, ఖాదర్, శ్రీనివాస్‌రెడ్డి, కేశవరెడ్డి, రమేష్, కవిత, మండల నాయకులు, సీపీఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.